సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

పేదల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 8లో▸



డీసీఎంను ఢీకొట్టిన బస్సు

ఆర్టీసీ బస్సు ఆగివున్న డీసీఎంను ఢీకొట్టడంతో 11 మంది గాయపడిన సంఘటన ఇబ్రహీంపట్నం పరిధిలో జరిగింది. 8లో▸



తరచూ రోడ్డు ప్రమాదాలు

ఆమనగల్లు సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని పోలీసు,జాతీయ రహదారుల అధికారులు పరిశీలించారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆదర్శ రైతు అవార్డు ప్రదానం



చల్లా పవన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన అమృత ఆహారం అందించే పర్యావరణ రక్షకుడు చల్లా పవన్‌రెడ్డి ఆదర్శరైతు అవార్డు అందుకున్నారు. బలరామ జయంతిని పురస్కరించుకుని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్ అగ్రి హార్టికల్చర్ సొసైటీ కార్యాలయం వద్ద రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత ఆహారం పండించే ఆదర్శ రైతులు, మిద్దె తోటల రైతులకు సన్మాన కార్యక్రమం, ఆదర్శ రైతుల అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతి, అమృత ఆహారం పండించడంలో అద్భుత విజయాలతోపాటు పర్యావరణ రక్షకులుగా నిలిచినందుకు చల్లా పవన్‌రెడ్డిని అవార్డుతో సత్కరించారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీ రేపు

మొయినాబాద్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 23న భర్తీ చేయనున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈ నెల 23న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు షేక్‌పేటలోని గురుకుల పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మెరిట్ ప్రాతిపదికన మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన 'గోలి'



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటులో మహిళాబిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా బిల్లు కోసం కృషి చేసిన కవితకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి యోగాసన పోటీలు




వివరాలు వెల్లడిస్తున్న నందనం కృపాకర్

కడ్తాల్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో శుక్రవారం నుంచి యోగాసన స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం మహేశ్వర మహా పిరమిడ్‌లో పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి 24 వరకు మూడురోజులపాటు పోటీలు కొనసాగుతాయని చెప్పారు. ఇటీవల రాష్ట్రంలోని 25 జిల్లాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన యోగాసనా ప్లేయర్స్ మహేశ్వర పిరమిడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు రాష్ట్ర స్థాయిలో 500 మందికి పైగా యోగాసన ప్లేయర్స్, 60 మంది టెక్నికల్ సిబ్బంది, రాష్ట్ర, జిల్లా స్థాయి పదాధికారులు రానున్నట్లు వెల్లడించారు. పోటీలను తిలకించేందుకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ యోగా రాంరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాతాళంలోనే జలం

భారీ వర్షాలు కురిసినా పెరగని నీటిమట్టం

- భూమిలోకి ఇంకని నీరు
- ఇంకుడుగుంతలు అంతంతే..
- ఆగిపోతున్న బోర్లు
- ఎండుముఖం పడుతున్న పంటలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆశించిన దానికంటే అధిక వర్షపాతం నమోదవుతున్నా.. చుక్క నీరు కూడా భూమిలోకి ఇంకని పరిస్థితి నెలకొంది. వచ్చిన నీరు వచ్చినట్లే మూసీవాగులో కొట్టుకుపోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగాల్సిన పాతాళ గంగమ్మ.. కంటికి కనిపించనంత లోతులో దాగిపోయింది. 2022 ఆగస్టుతో పోలిస్తే.. 2023లో భూగర్భజల మట్టం భారీగా పడిపోయింది. గతంతో పోలిస్తే.. ఈసారి అధిక వర్షపాతంనమోదైనప్పటికీ.. భూగర్భ జలం మాత్రం అట్టడుగునే ఉండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాకాలం పూర్తి కాక ముందే భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో వ్యవసాయ బోర్లు ఆగిపోతుండడంతో బావుల కింద పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

ఆనవాళ్లు కోల్పోతున్న నీటి వనరులు

జిల్లాలోని ప్రధాన వాగులు, వంకలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నీటి వనరులు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎత్తయిన కొండలు, గుట్టలే కాదు లోతట్టు ప్రాంతాలు సైతం మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీ కేంద్రాలే వెలుస్తున్నాయి. పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయి. వెరసి భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి నెలకొంది.

కనిపించని ఇంకుడు గుంతలు

నిజానికి బహుళ అంతస్తుల నిర్మాణాల్లో ఇంకుడు గుంతలను తప్పనిసరి చేసింది. ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో మెజార్టీ బిల్డర్లు వీటి నిర్మాణానికి వెనుకాడుతున్నారు. నిర్మాణాలు పూర్తయినా మార్టిగేజ్‌లో ఉన్న ప్లాట్లు విడిపించాలంటే.. హెచ్ఎండీఏ సహా స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విధిగా పర్యటించి, ఇంకుడు గుంతలను పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. భవన నిర్మాణ ప్రదేశంలోనే కాకుండా కాంపౌండ్ వాల్ లోపల కూడా వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా కాంక్రీట్ వేస్తున్నారు. ఇళ్ల ముందే కాదు వెంచర్లలోని ఖాళీ ప్లాట్ల మధ్య కూడా తారు, సిమెంట్ రోడ్లు వేసి, నీరు భూమిలోకి ఇంకకుండా చేస్తున్నారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకకపోవడం, భూగర్భ జలాలను మోటార్ల ద్వారా బయటికి తోడేస్తుండటం కూడా భూగర్భజల మట్టం పడిపోవడానికి మరో కారణం.

చెరువుల నిండా నీరున్నా..

శేరిలింగంపల్లి మండలంలో 2022 ఆగస్టులో 5.23 మీటర్ల లోతులోనే భూగర్భజలం లభించగా, 2023 ఆగస్టులో 15.33 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇబ్రహీంపట్నం, గండిపేటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిజానికి ఇక్కడ భారీ చెరువులు కూడా ఉన్నాయి. ఆయా చెరువుల నిండా నీరు పుష్కలంగా ఉంది. అయినా భూగర్భజల మట్టం మాత్రం పాతాళంలోనే దాగి ఉండడం విశేషం.

ఆ నేలల్లో సరిగా ఇంకదు

నల్లరేగడి, బురద నేలల్లో వర్షపు నీరు పెద్దగా ఇంకదు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ నీటి లభ్యత ఆశించిన స్థాయిలో లభించదు. కొండలు, గుట్టలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ నీరు పెద్దగా ఇంకదు. ఇంకిన నీరు కూడా రెండు మూడు అడుగుల లోతు వరకే చేరుతుంది. ఇది చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. మైదాన ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ కారణంగా మెజార్టీ ప్రదేశం కాంక్రీట్‌మయమైంది. భారీగా వర్షాలు కురుస్తున్నా..భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి నెలకొంది.

– రఘుపతిరెడ్డి, జిల్లా భూగర్భ జలవనరులశాఖ



డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

డ్రా తీసి.. తాళాలు అందించి

- మన్సాన్‌పల్లిలో లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు
- హాజరైన మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలు

మహేశ్వరం: రాజకీయ పార్టీలు, కుల,మత బేధాలు లేకుండా గూడు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి సర్వే నంబర్ 140లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను గురువారం డ్రా తీసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలి, ఆత్మ గౌరవంతో గొప్పగా జీవించాలనే సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, లిఫ్ట్ సౌకర్యం, షాపింగ్ కాంప్లెక్స్ వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఉన్న మహేశ్వరం నియోజకవర్గంలో కొన్ని రాజకీయ పార్టీలు ఉనికిని కాపాడుకోవడానికి మత విద్వేషాలు ఉసిగొల్పుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఉచిత హామీలు ఇచ్చి పోతున్నారని, వాటిని ప్రజలు నమ్మొద్దని సూచించారు. అంతకు ముందు మంఖాల్ పేజ్–1–130, మంఖాల్ పేజ్–2–140, జీహెచ్ఎంసీ–400లో మొత్తం 797 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పత్రాలతోపాటు ఇంటి తాళాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గెం మల్లేశం, దయనంద్‌గుప్తా, కలెక్టర్ హరీశ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం

హయత్‌నగర్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అన్ని విధాలా వెనుకబడి పోతుందనే అపోహలను తొలగిస్తూ తొమ్మిదేళ్లలో అన్ని రకాలుగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తట్టిఅన్నారంలో నిర్మించిన 1,168 డబుల్ బెడ్రూం ఇళ్లను గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. వెయ్యికిపైగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశామని, రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, శాంతి భద్రతల నిర్వహణలో మొదటి స్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌రావు, రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ రవిందర్‌దత్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి సొంత ఇంటి కల సాకారం..

సీఎం కేసీఆర్ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటి కలను నిజం చేశారని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుద్బుల్లాపూర్ పరిధిలోని తిమ్మాయిగూడలో నిర్మించిన 500 డబుల్ బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖ, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవదాసుగౌడ్ పాల్గొన్నారు.



తట్టిఅన్నారంలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్

మన్సూరాబాద్: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని గనులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధి హత్తిగూడ వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించి డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. పూర్తి పారదర్శకంగా డబుల్ ఇళ్ల కేటాయింపులు జరిగాయని, అర్హులైన పేదలందరికీ దశలవారీగా డబుల్ ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు.కార్యక్రమంలో పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల సప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ పాల్గొన్నారు.

పారదర్శకంగా 'డబుల్'

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అరవై ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో జరగని అభివృద్ధి, ఈ తొమ్మిదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని, అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పత్రాలను కుత్బుల్లాపూర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, పటాన్‌చెరు, మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలోని లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. డబుల్‌బెడ్రూం ఇళ్లను పారదర్శకంగా కేటాయించినట్టు చెప్పారు. కొల్లూరులో లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వడంతో పాటు, ఇక్కడ నివసించే ప్రజల కోసం ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖాన, రేషన్‌షాపు, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే హైకమాండ్ అని, ఒక్కొక్కరు ఒక్కో కేసీఆర్‌గా మారి చేసిన అభివృద్ధిని గల్లీగల్లీకి వెళ్లి ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, ప్రకాష్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, సంగారెడ్డి కలెక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

అప్‌డేట్ చేస్తేనే.. ఆహార భద్రత

- రేషన్ కావాలంటే ఈ– కేవైసీ చేయాల్సిందే
- లేదంటే బియ్యం సరఫరా కట్
- 24 వరకు అప్‌డేట్‌కు అవకాశం



జిల్లా	చనిపోయిన లబ్ధిదారులు
రంగారెడ్డి	28,207
హైదరాబాద్	8742
మేడ్చల్–మల్కాజిగిరి	13,246

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆహార భద్రత కార్డు లబ్ధిదారుల్లో కేవైసీ పునరుద్ధరించుకోని యూనిట్ల (లబ్ధిదారుల)పై వేటు పడనుంది. చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యం కోటా విడుదలకు లబ్ధిదారుల ఈ కేవైసీ పునరుద్ధరణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ కార్డులో అందుబాటులో లేని, మృతి చెందిన యూనిట్లను ఏరివేసే చర్యలకు పౌర సరఫరాల శాఖ ఉపక్రమించింది. డీలర్ల వద్ద నున్న ఈ– పాస్ యంత్రం ద్వారా కేవైసీ అప్‌డేట్‌కు అవకాశం కల్పించింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ–పాస్ ప్రక్రియ తర్వాత ఇప్పటి వరకు కేవైసీ పునరుద్ధరణ చేయలేదు. దీంతో కార్డుల్లోని 20 శాతంపైగా లబ్ధిదారులు అందుబాటులో లేకున్నా నెలసరి బియ్యం మాత్రం యథాతథంగా పంపిణీ అవుతున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు.

చనిపోయిన వారే లక్ష మంది

గ్రేటర్ పరిధిలో ఇప్పటి వరకు లక్ష మంది లబ్ధిదారులు మృతిచెందినట్లు పౌర సరఫరాల శాఖ గుర్తించింది. వీరిలో 50,195 మందిని కేవైసీ అప్‌డేషన్ ద్వారా గుర్తించారు. వీరితో పాటు మరో రెండు లక్షల మంది వరకు అందుబాటులో లేరని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరిలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలు, విదేశాలకు వెళ్లిన వారు, ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిగి అత్తవారింటికి వెళ్లడం, మగ వారి పెళ్లిళ్లు జరిగి కుటుంబాలు విడిపోవడం వంటివి ఉన్నట్లు తెలుస్తోంది.

మొరాయిస్తున్న సర్వర్

రేషన్ ఈ– కేవైసీ పునరుద్ధరణ కోసం ఈ– పాస్‌కు తాకిడి పెరగడంతో సెంట్రల్ సర్వర్ ఇబ్బంది పెడుతోంది. రేషన్ కోటా కోసం ఈకేవైసీ తప్పనిసరి కావడంతో వారం రోజులుగా లబ్ధిదారులు చౌకధరల దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. ఈ నెల 24 వరకు మాత్రమే రేషన్ పంపిణీ గడువు ఉండటంతో ఆ తర్వాత షాపుల తెరిచే అవకాశం ఉండకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన పెరిగింది.

వసూళ్ల దందా...

ఈ కేవైసీ పునరుద్ధరణకు కోసం కొంతమంది డీలర్లు వసూళ్ల దందాకు దిగారు. రేషన్ షాపుకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి చార్జీల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొంతమంది షాపుల వద్దే డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

వసూలు చేస్తే చర్యలు

రేషన్ ఈ– కేవైసీ పునరుద్ధరణలో లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేసే డీలర్లపై చర్యలు తప్పవు. ఈ కేవైసీ ఉచితంగా చేయాలి. రేషన్ తీసుకునే వారంతా విధిగా అప్‌డేట్ చేయించుకోవాలి.

– రాథోడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి

నగరంలో వరల్డ్ కప్ ట్రోఫీ టూర్



సాక్షి, హైదరాబాద్: పుష్కర కాలం తర్వాత భారత గడ్డపై నిర్వహిస్తున్న వన్డే వరల్డ్ కప్‌కు సంబంధించిన సందడి అంతటా కనిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వేర్వేరు వేదికల్లో జరిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రచార కార్యక్రమాల తర్వాత ఇప్పుడు మన నగరంలో వరల్డ్ కప్ ట్రోఫీ సందడి చేసింది. క్రికెట్ అభిమానులను అలరిస్తూ వచ్చిన ఈ కప్ రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో అభిమానులకు చేరువగా వచ్చింది. గురువారంతో నగరంలో ఈ ఐసీసీ ట్రోఫీ టూర్ ముగిసింది. బుధవారం అభిమానుల కోసం రామోజీ ఫిల్మ్‌సిటీ, ఇనార్బిట్ మాల్‌లలో ట్రోఫీని ఉంచారు. క్రికెట్ ప్రేమికులు సెల్ఫీలతో ఆటపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం వరల్డ్ కప్ నిర్వాహకులు నగరంలో మూడు చోట్ల ట్రోఫీని ప్రదర్శించారు. నగరానికి చిరునామా అయిన చారిత్రాత్మక చార్మినార్ వద్ద, ఆ తర్వాత హుస్సేన్ సాగర్ ఐసీసీ ప్రతినిధులు ట్రోఫీని ఉంచి ప్రచారం నిర్వహించారు. అనంతరం వరల్డ్ కప్‌లో మూడు మ్యాచ్‌లకు వేదికైన ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ట్రోఫీని ప్రదర్శించారు. ఉప్పల్ స్టేడియంలో అక్టోబర్ 6, 9, 10 తేదీల్లో మూడు వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. అంతకు ముందు ఈ నెల 29, అక్టోబర్ 3 తేదీల్లో వార్మప్ మ్యాచ్‌లు కూడా నిర్వహిస్తారు. భారత జట్టు పాల్గొనే మ్యాచ్‌లు ఇక్కడ లేకపోయినా.. వరల్డ్ కప్ పోరు కావడంతో ఇతర టీమ్‌ల మ్యాచ్‌లపై కూడా ఆసక్తి నెలకొంది. వరల్డ్ కప్ టూర్‌లో భాగంగా ట్రోఫీ నగరం నుంచి చెన్నైకి వెళ్లింది.

కార్పొరేషన్‌లో సౌకర్యాలేవీ?

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉండాల్సిన సౌకర్యాలేవీ మీర్‌పేట ప్రాంతంలో లేవని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నాలుగైదు రోజులకోసారి తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నారని అన్నారు. కొన్ని చోట్ల మంచినీరు కలుషితం కావడంతో పాటు పురుగులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో మీర్‌పేట ప్రాంతం పంచాయతీగా ఉన్నప్పుడు రూ.1.50 కోట్ల నిధులు తీసుకొచ్చి సాహెబ్‌నగర్ రిజర్వాయర్ నుంచి నాలుగు ప్రధాన లైన్‌లు వేసి నీటిని అందించామని గుర్తు చేశారు. మంచినీటితో పాటు కార్పొరేషన్‌లో వీధిదీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకపై కార్పొరేషన్‌లో రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి, ఇంటింటికీ పాదయాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ వాణికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు దేవగోని కృష్ణ, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పద్మశ్రీ, అరుణ, పైళ్ల శేఖర్‌రెడ్డి, పరశురాం, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

హస్తినకు చేరిన 'హస్తం' పంచాయితీ

- ఎల్‌బీనగర్ నుంచి పోటాపోటీ
- అధిష్టానం వద్దకు వివాదం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎల్‌బీనగర్ కాంగ్రెస్ టికెట్ పంచాయితీ హస్తినకు చేరింది. దరఖాస్తుల దాఖలు.. గాంధీభవన్‌లో పోస్టర్ల చించివేతతో ముదిరిన లడాయి తాజాగా టికెట్ విషయంలో స్థానిక, స్థానికేతర వివాదానికి తెరలేపింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీకి వెళ్లిన ఆశావహులు.. అధిష్టానం ముందు పంచాయితీ పెట్టారు. గత ఎన్నికల్లో పార్టీ తరపున గెలుపొందిన అభ్యర్థి ఆ తర్వాత గులాబీ గూటికి చేరడంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలోనే వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో ఏఐసీసీ అధికార ప్రతినిధి మధుయాస్కీ ఈ సెగ్మెంట్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేయడం వివాదానికి ఆజ్యం పోసింది. ఇప్పటికే మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి గ్రూపులుగా విడిపోయి టికెట్ కోసం ప్రయత్నిస్తుండగా యాస్కీ కూడా రేసులోకి రావడంతో వివాదం తారాస్థాయికి చేరింది. పార్టీ హైకమాండ్ దగ్గర పలుకుబడి ఉన్న యాస్కీకి అభ్యర్థిత్వం ఖరారవుతుందనే ప్రచారంతో అప్రమత్తమైన ఆశావహులు తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా నేతలు గురువారం ఢిల్లీకి చేరుకుని పీసీసీ నేతలతో పాటు ఏఐసీసీ పెద్దలను కలిశారు. మరోవైపు ఇటీవల గాంధీభవన్‌లో యాస్కీని వ్యతిరేకిస్తూ పోస్టర్లు వెలియడం.. ఇది జక్కిడి అనుచరులు చేసిన పనేనని చర్యలు తీసుకోవాలని యాస్కీ చేసిన ఫిర్యాదు కూడా వివాదం ముదిరేలా చేసింది.



ఢిల్లీలో భట్టివిక్రమార్కను కలిసిన ఎల్‌బీనగర్ కాంగ్రెస్ నాయకులు

స్థానిక పంచాయితీ!

మొదట్నుంచీ ఈ నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడుపుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఈసారి తమకే సీటు ఖాయమనే ధీమాలో ఉన్నారు. మరోవైపు లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖరరెడ్డి కూడా టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. బీజేపీ హవాకు ఎదురొడ్డి గెలిచినందున.. తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని పట్టుబడుతున్నారు. వీరితోపాటు మరికొందరు కూడా తెరవెనుక ప్రయత్నాలు మొదలు పెట్టారు. అనూహ్యంగా మాజీ ఎంపీ మధుయాస్కీ పేరు తెర మీదకు రావడం.. వీరిని డైలామాలో పడేసింది. ఆయన స్వస్థలం హయత్‌నగర్ కావడంతో తనకు స్థానిక కోటాలో టికెట్ ఖరారు చేయాలని ఆయన అధిష్టానానికి విన్నవించుకుంటున్నారు. గతంలో నిజామాబాద్ నుంచి పోటీ చేసినందున.. ఆయనను స్థానికేతరుడిగానే పరిగణించాలని సొంత పార్టీలోని వైరివర్గం స్పష్టం చేస్తోంది. మరోవైపు ఇదే సూత్రం మల్‌రెడ్డి రాంరెడ్డికి కూడా వర్తిస్తుందని చెబుతున్నారు. ఆయన ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌కు చెందిన వారు కావడంతో స్థానికేతరుడని..స్థానికులమైనందున తమ పేర్లను పరిశీలించాలని జక్కిడి, దర్పల్లి వాదనలు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిక్కుముడిగా మారిన ఎల్‌బీ నగర్ టికెట్ పేచీ అధిష్టానం పెద్దల ముందుకు చేరింది.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

11 మందికి గాయాలు
- ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ప్రమాదం
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ అద్దె బస్సు ఆగివున్న డీసీఎంను ఢీకొట్టిన సంఘటనలో 11 మంది గాయపడిన సంఘటన గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు స్థానిక చెరువు కట్టపై నిలిపివున్న డీసీఎం వ్యాన్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతిని, ఒక్కసారిగా కుదుపునకు గురైంది. బస్సు ముందు భాగంలో ఉన్న ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఇబ్రహీంపట్నానికి చెందిన ఎ.జగదీశ్వర్(30), బి.శ్రీలత(25), కె.మల్లమ్మ(55), హెచ్ లక్ష్మమ్మ(70), ఎస్ సుమలత(35) మంగ(31), భాగ్యమ్మ(48), సబిత(35), ఆరుట్లకు చెందిన బుగ్గరాములు(50), వికారాబాద్‌కు చెందిన యు.మల్లేశ్(19) గాయపడగా వెంటనే వీరిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. కండక్టర్ రాములు(50) తలకు గాయం కావడంతో తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు.

వైద్యులు అందుబాటులో లేక ఇబ్బందులు..

క్షతగాత్రులను ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు అందుబాటులో లేరు. దీంతో చికిత్సలు అందించడంలో జాప్యం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు, కాంగ్రెస్ నేతలు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. నైట్ డ్యూటీ డాక్టర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తచేశారు. గాయపడిన వారిలో కొంత మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. గాయపడిన వారెవరికీ ప్రాణపాయ పరిస్థితి లేదని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.



దెబ్బతిన్న బస్సు ముందుభాగం

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామలో గురువారం నిర్వహించిన షాదీముబారక్, కాల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, పథకాలతో సీఎం కేసీఆర్ పేదప్రజల ఇళ్లల్లో వెలుగులు నింపారన్నారు. నందిగామ మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, సర్పంచ్‌లు రాజునాయక్, అశోక్, చంద్రారెడ్డి, అనిత, రమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, రాజ్‌గోపాల్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు కుమార్, వీరేందర్ గౌడ్, శ్రీశైలం, గోపాల్ రెడ్డి, పెంటయ్యగౌడ్, శ్రీనివాస్, నర్సింహ, నయాబ్ తహసీల్దార్ విజయ్, ఆర్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

కొత్తూరు: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో రూ.3.60 కోట్లతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తాయన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సహకార సంఘం కార్యాలయ సందర్శన



సంఘం పాలకవర్గంతో ట్రెయినీ ఉద్యోగుల బృందం

తుర్కయంజాల్: తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్‌లో శిక్షణ పొందుతున్న ఉద్యోగుల బృందం స్టడీ టూర్‌లో భాగంగా గురువారం తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఉద్యోగులకు సంఘం సీఈఓ వై.రాందాస్.. కోఆపరేటివ్ చట్టం-1964 రూల్స్, చైర్మన్, డైరక్టర్లు, రైతుల మధ్య సమన్వయం, ఆర్థిక వ్యవహారాలు, వ్యవసాయ ఇతర అనుబంధ అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలు, మల్టీసర్వీస్ సెంటర్స్, మహాజన సభ సమావేశం వంటి అంశాల గురించి వివరించారు. సహకార సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకన్న, కోర్సు కోఆర్డినేటర్ విజయ, జాయింట్ రిజిస్ట్రార్ సురేఖ, సంగీత, పరిమళాదేవి, వసంత తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు చరిత్రాత్మకం

నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు

కల్వకుర్తి/ కడ్తాల్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు అన్నారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సగభాగమైన మహిళలకు ఎన్నో ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకపోవడంతో వారికి సరైన ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లు కోసం శాసనసభలో తీర్మాణం చేసి.. దానిని కేంద్రానికి పంపించడం జరిగిందని గుర్తుచేశారు. మహిళలకు రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరుగుతుందని, రాజకీయపరంగా, అధికారాల పరంగా, సామాజిక పరంగాను మెరుగైన అవకాశాలు దక్కుతాయని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు జహంగీర్ అలీ, కృష్ణ, రమేశ్, జంగయ్య, నర్సింహగౌడ్, రాజుగౌడ్ గణేశ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

తరచూ రోడ్డు ప్రమాదాలు

జాతీయ రహదారిని పరిశీలించిన అధికారులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని పోలీసుశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. జాతీయ రహదారిపై ఉన్న సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీంద్రనాయక్, ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం, జాతీయ రహదారుల శాఖ ఏఈ గంగాధర్ ప్రమాదాలు జరుగుతున్న స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వారు చర్చించారు.



ఆమనగల్లు సమీపంలో జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

ఎన్నికల్లో బీజేపీని తరిమికొడదాం



నిరసన ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ
- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మాట నిలబెట్టుకోలేదని నిరసన

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గకరణపై దళితులను నమ్మించి మోసం చేసిన బీజేపీని రాబోయే ఎన్నికల్లో తరిమికొట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఆయన విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణ ముఖ్యకూడలిలో మానవహారాన్ని ఏర్పాటుచేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పిన బీజేపీ 9 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ వర్గీకరణ చేయకపోవడం మాదిగజాతికి అన్యాయం చేయడమేనని అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపినా కేంద్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం దళితులను నయవంచనకు గురిచేసిందని మండిపడ్డారు. వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను, పాండు, లక్ష్మయ్య, శ్రావణ్‌కుమార్, మధు, నవీన్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని..

వృద్ధురాలి దుర్మరణం

మంచాల: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంచాల మండలం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. మంచాల ఎస్‌ఐ రవి నాయక్ కథనం ప్రకారం.. హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై జేబీ వెంచర్ సమీపంలో బుధవారం రాత్రి ఓ వృద్ధురాలి(65)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఆమె శరీరంపై పసుపు కలర్ జాకెట్, ఆకుపచ్చ కలర్ చీర ధరించి ఉంది. గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన మంచాల పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు యాచకురాలు అయిఉండవచ్చని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బడంగ్‌పేట్: అథ్లెటిక్స్‌లో బడంగ్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు ధనలక్ష్మి (100 మీటర్ల పరుగుపందెం), నవ్య (జావలిన్‌త్రో), పల్లవి (జావలిన్‌త్రో)జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటారని ప్రధానోపాధ్యాయుడు అర్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వీరు హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరగనున్న ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీ(రాష్ట్రస్థాయి)ల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులు అక్కడ కూడా విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని హెచ్‌ఎం కోరారు.

స్థానికేతరులకే డబుల్ ఇళ్లా?

బీఆర్‌ఎస్ సర్కార్‌పై మాజీ ఎంపీ బూర ఫైర్

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తట్టిఅన్నారం, తిమ్మాయిగూడ, హత్తిగూడ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంఐఎం పార్టీకే ధారాదత్తం చేస్తున్నారంటూ బీజేపీ నేత, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. మూడు ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలను బీఆర్‌ఎస్ నేతలు గురువారం ప్రారంభించిన నేపథ్యంలో మాజీ ఎంపీ బూర మాట్లాడుతూ.. మొత్తం 2300 ఇళ్లు నిర్మిస్తే దాంట్లో నియోజకవర్గానికి చెందిన వారికి కేవలం 300 ఇళ్లు మాత్రమే కేటాయించి మిగిలిన 2వేల ఇళ్లను నియోజకవర్గానికి, జిల్లాకు సంబంధంలేని మలక్‌పేట, చంద్రాయణగుట్ట, యాకత్‌పూర నియోజకవర్గాల్లోని ఒక వర్గానికి చెందిన వారికి కేటాయించారని ఆరోపించారు. ఎంఐఎం పార్టీ నేతలు సూచించిన లిస్ట్ ప్రకారమే ఇళ్ల కేటాయింపు జరిగిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సర్కార్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

షాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పెంటయ్య, హెచ్‌ఎం నాగిరెడ్డితో కలిసి గురువారం మొక్కలు నాటే కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

కొనుగోలు చేసినవారిపై కేసు నమోదు
- మొయినాబాద్ మండలం ఎనికేపల్లి రెవెన్యూలో వెలుగులోకి..

మొయినాబాద్: నకిలీ వ్యక్తిని సృష్టించి ప్లాటు కొనుగోలు చేసిన వారిపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌కు చెందిన నర్సింహగౌడ్ మొయినాబాద్ మండల పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూలో ఉన్న ఏ-1 గార్డెన్‌లోని 455 గజాల ప్లాట్‌ను 2005 సంవత్సరంలో కొనుగోలు చేశాడు. ప్లాటు చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేయించాడు. అప్పుడప్పుడు వచ్చి ప్లాటు చూసుకుని వెళ్లేవాడు. ఇదే క్రమంలో బుధవారం నర్సింహగౌడ్ ప్లాటువద్దకు వచ్చేసరికి ఇతరులు ప్లాటును కబ్జాచేసి ప్రహరీని తొలగించారు. మా ప్లాటులో మీరెందుకున్నారంటూ నర్సింహగౌడ్ అక్కడున్నవారిని ప్రశ్నింగా ప్లాటు కొనుగోలు చేశామంటూ చెప్పారు. ఎవరి వద్ద కొన్నారని అడిగితే నర్సింహగౌడ్ వద్ద కొనుగోలు చేశామని.. కావాలంటే ఈసీ చూడండని చూపించారు. నర్సింహగౌడ్‌ను తానేనని.. ప్లాటు నేను విక్రయించలేదని చెప్పినా వారు వినిపించుకోలేదు.

నకిలీ వ్యక్తితో రిజిస్ట్రేషన్...

నర్సింహగౌడ్ కొనుగోలు చేసిన ప్లాటు సీసీ కాపీలను సృష్టించిన కొందరు అదే పేరుతో నకిలీ వ్యక్తిని సృష్టించారు. నర్సింహగౌడ్ పేరు వాడుకుని నకిలీ ఆధార్ నంబర్, ఫొటోతో చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 6న నగరానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ అహ్మద్, మజహర్‌అలీ అనే ఇద్దరు వ్యక్తుల పేర్లతో 227 గజాల చొప్పున రెండు ప్లాట్లుగా విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేశారు. చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు లేకుండానే ఓ అడ్వకేట్ ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిసింది. కొనుగోలు చేసిన వ్యక్తులు ప్లాటు కబ్జాలోకి వచ్చారు. ఇదే క్రమంలో నర్సింహగౌడ్ ప్లాటు వద్దకు వెళ్లేసరికి కబ్జా బాగోతం బయటకొచ్చింది. దీంతో నర్సింహగౌడ్ మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- మంచాల సమీపంలో పల్టీకొట్టిన కారు
- ఒకరి దుర్మరణం, ఐదుగురికి గాయాలు



శివకుమార్ (ఫైల్)

మంచాల: అతివేగంగా ఓ యువకుడి ప్రాణం బలిగొంది. మంచాల ఎస్‌ఐ రవినాయక్ కథనం ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన భగత్, అభిషేక్, అనిల్, గణేశ్, నవీన్, శివకుమార్ బుధవారం కారులో మంచాల నుంచి ఇబ్రహీంపట్నంకు వెళ్లారు. ఇబ్రహీంపట్నం నుంచి తిరిగి మంచాల వస్తుండగా మంచాల కొత్త చెరువు కట్టపైకి రాగానే కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అందరికీ తీవ్ర గాయాలయ్యాయి. శివకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతావారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరంతా డెకరేషన్ వర్క్స్ చేస్తున్నారు. శివకుమార్ మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.



మంచాల చెరువుకట్ట వద్ద పల్టీకొట్టిన కారు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొంగగూడ గ్రామశివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని కొంగగూడకు చెందిన రవినాయక్(40), భార్య రాజీ దంపతులు గత కొన్నేళ్లుగా గ్రామశివారులోని తోటపని చేస్తున్నారు. ఎప్పటిలాగే రవినాయక్, రాజీ దంపతులు గురువారం ఉదయం పని నిమిత్తం తోటకు వెళ్లారు. కొంత సమయం తర్వాత రవినాయక్ తోటలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసేదిలేదని తండావాసులు పట్టుబట్టారు. పోలీసులు తండావాసులకు నచ్చజెప్పి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రవినాయక్ మృతదేహం